# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు వక్రీకరించాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు.
- ❖ సాంస్కృతిక ఐక్యతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర గనుల శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.
- ❖ ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెట్ ఐలాండ్ వైపుగా వెళ్తున్న ఫెర్రీ పడవ ప్రమాదానికి గురైంది.
- ❖ భారత ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ ఈరోజు అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు.

=======================

డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు వక్రీకరించాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆయన ఈరోజు పార్లమెంటు హౌస్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ... రాజ్యసభలో నిన్న అమిత్ షా భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నఅంశంపై చేపట్టిన ప్రత్యేక చర్చలో భాగంగా మాట్లాడిన చిన్న విషయాన్ని వక్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ అంశంపై పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలిగించినందుకు ప్రతిపక్షాలపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

=======================

అండమాన్, నికోబార్‌లోని దీవులకు దేశ వీరుల పేర్లను పెట్టడం దేశానికి వారు చేసిన సేవలను రాబోయే తరాలకు గుర్తుంచుకునే మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు వ్యాఖ్యానించారు. తమ మూలాలతో ముడిపడి ఉన్న దేశాలు అభివృద్ధి దేశ నిర్మాణంలో వారి మూలాలతో ముందుకు సాగాలని ప్రధాన మంత్రి ఈరోజు సామాజిక

మాధ్యమంలో పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య సమరయోధులు మన దేశంపై చెరగని ముద్ర వేశారని, వారి స్మృతులను సంరక్షించడానికి చేస్తున్న ప్రయత్నంలో ఇది కూడా ఒక భాగమని ప్రధాన మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక వసతుల కల్పనతో పాటు సాంస్కృతిక వికాసం, ఐక్యతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర గనుల శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ చారిత్రక వైవిధ్యం గురించి మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ… భారతదేశంలో 121 భాషలు, దాదాపు 1600 మాండలికాలు ఉన్నాయన్నారు. భాషని కేవలం సమాచార వారధిగా మాత్రమే కాకుండా జ్ఞాన సంస్కృతిగానూ, సంప్రదాయాల వారసత్వంగా చూడాలన్నారు. భావ వ్యక్తీకరణకు భాషలు ముఖ్యమైన మాధ్యమం కాబట్టి వాటిని రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020లో మూడు భాషల సూత్రాన్ని తీసుకువచ్చిందని మంత్రి వివరిస్తూ …

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెట్ ఐలాండ్‌కు 80 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫెర్రీ పడవ ప్రమాదానికి గురైంది. ఈరోజు మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో మరొక స్పీడ్ బోట్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. నేవీ, జేఎన్‌పీటీ, తీరప్రాంత గస్తీ బృందం, స్థానిక పోలీసులు తక్షణం రంగంలోకి దిగి ప్రయాణికులను కాపాడేందుకు చర్యలు చేపట్టారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇప్పటివరకూ 77 మందిని సహాయక సిబ్బంది కాపాడారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈరోజు బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (LAC) వెంబడి శాంతి నిర్వహణ, తూర్పు లడఖ్‌లో సైనిక ప్రతిష్టంభన కారణంగా 4 సంవత్సరాలుగా నిలిచిపోయిన ద్వైపాక్షిక సంబంధాలు ఇటీవల పునరుద్ధరించబడ్డాయి. దాదాపు 5 సంవత్సరాల విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన ప్రత్యేక ప్రతినిధుల చర్చల్లో పాల్గొనేందుకు భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న అజిత్ దోవల్ నిన్న బీజింగ్ చేరుకున్నారు. ప్రత్యేకించి ఇరు దేశాల మధ్య తూర్పు లడఖ్‌లో ఏర్పడిన అనిశ్చితికి ముగింపు పలుకుతూ అక్టోబర్ 21న కీలక ఒప్పందం కుదిరింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలోని 308 జిల్లాల్లో మొత్తం 522 కమ్యూనిటీ రేడియో స్టేషన్లు ఉన్నాయని సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఈరోజు తెలియజేశారు. ఈరోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో భాగంగా… గత పదేళ్లలో ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కార్యక్రమాల వల్ల కమ్యూనిటీ రేడియో స్టేషన్ల సంఖ్య దాదాపు 300 శాతం పెరిగిందన్నారు. 2023 సంవత్సరంలో 8 లక్షల 92 వేల మంది భారతీయ విద్యార్థులు చదువుల కోసం విదేశాలకు వెళ్లారని విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ రాజ్యసభకు ప్రశ్నోత్తరాల సమయంలో తెలియజేశారు. మరోవైపు "వన్ నేషన్… వన్ సబ్‌స్క్రిప్షన్…" పథకంలో 30 ప్రసిద్ధ ప్రచురణకర్తలచే ప్రచురించబడిన 13 వేలకు పైగా పండిత పత్రికలు చేర్చబడ్డాయని విద్యా మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మైనారిటీ వర్గాల అభ్యున్నతికి గత 10 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ మైనారిటీ విద్యాసంస్థల 20వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం తన నినాదమైన “సబ్‌కా సాథ్, సబ్‌కా విశ్వాస్”కు అనుగుణంగా నడుస్తోందని, నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి జవాబుదారీగా ఉంటోందన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన వంటి ప్రభుత్వ పథకాలు పేదల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడ్డాయని ధర్మేంద్ర ప్రధాన్ వివరిస్తూ ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లో నిరసన తెలుపుతున్న రైతులు ఈరోజు దాదాపు 50 చోట్ల రైళ్లను నిలిపివేసారు. పంటలకు కనీస మద్దతుతో పాటూ ఇతర విషయాలల్లో న్యాయపరమైన హామీ కోసం రైతులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నిరసనలు చేపడుతున్నారు. వివిధ కిస్సాన్ సంఘాల వ్యవసాయ కార్యకర్తలు మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు 3 గంటల పాటు రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. తమ నిరసనలు శాంతియుతంగా చేపడతామని కేవలం రైల్వే క్రాసింగ్‌లు, స్టేషన్‌లలో మాత్రమే ఉంటాయని రైతు నాయకులు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదికగా జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 3వ టెస్ట్ డ్రాగా ముగిసింది. వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న భారత్ వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. ఆ సమయంలో భారత్ గెలవడానికి ఇంకా 267 పరుగులు చేయాల్సి ఉంది.  కానీ వాతావరణం సహకరించకపోవడంతో అంపైర్లు 5వ రోజు ఆటను ముందుగా నిలిపి వేశారు. ఇదిలా ఉండగా ప్రముఖ భారత ఆల్ రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 3వ టెస్ట్ ముగిసిన అనంతరం ఈ ప్రకటన చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లలో అశ్విన్ రెండో స్థానంలో నిలిచాడు. అతని కెరీర్‌లో మొత్తం 537 వికెట్లు తీయడంతో పాటూ 6 సెంచరీలు, 14 అర్ధసెంచరీలు కూడా చేశాడు. భారత జట్టుకి పలు కీలక సమయాల్లో తన ఆల్ రౌండర్ ప్రదర్శనతో విజయాలు అందించాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 666 పాయింట్ల వద్ద ప్రారంభమై, చివరికి 502 పాయింట్ల నష్టంతో 80 వేల 182 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 137 పాయింట్ల నష్టంతో 24 వేల 198 వద్ద ముగిసింది. మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.67 డాలర్లు వద్ద, బంగారం ఔన్సు 2 వేల 661 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =